జడ్జినంటూ ప్రొటోకాల్ దర్శనం!

- హైదరాబాద్ పోలీసుల అరెస్టుతో బయటపడిన వ్యవహారం
- కంగుతిన్న రాజన్న ఆలయ అధికారులు, స్థానిక పోలీసులు

వేములవాడ, జూన్ 1: రాజన్న దర్శనానికి వచ్చిన ఓ మహిళ తాను న్యాయమూర్తి అని చెప్పి ప్రొటోకాల్ దర్శనం, అతిథి మర్యాదలు అధికారుల ద్వారా పొంది చివరికి హైదరాబాద్ పోలీసుల చేతిలో అరెస్టు అయింది. దీంతో రాజన్న ఆలయ అధికారులు, పోలీసులు కంగుతిన్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన ప్రసన్నారెడ్డి ఆదివారం వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చింది. తాను మొదటగా న్యాయవాదిని, తర్వాత రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు న్యాయమూర్తినని ఆలయ ఉద్యోగులను నమ్మించింది. దీంతో ఆలయ అధికారులు ప్రొటోకాల్ దర్శనం చేయించి, సకల మర్యాదలు చేశారు. అయితే సదరు మహిళా హైకోర్టు (హైదరాబాద్)లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి నగదు వసూలు చేసి మోసాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు రావడంతో మధురానగర్ పోలీసులు ఆమెను ఆచూకీ కోసం వేములవాడకు వచ్చినట్లు సమాచారం. స్వామివారి దర్శనం చేసుకుని తిరిగివెళ్తుండగా కరీంనగర్‌లో ఆమెను అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు, పోలీసులు కంగుతిన్నారు.

'కంపు'కొడుతోంది

- ఇండ్ల మధ్యలో ఖాళీ స్థలం
- చిన్నపాటి వర్షానికే జలమయం
- దురాస్వనతో ఇబ్బందుల్లో గ్రామస్తులు
- సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

మామిడిపల్లి గ్రామంలోని ఓ ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు

కోనరావుపేట, జూన్ 1: మామిడిపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డు వెంబడి ఓ ఖాళీ స్థలం ఉన్నది. వానకాలం వచ్చిందంటే చాలు చిన్నపాటి వర్షానికే కుంట మాదిరిగా ఉన్న సదరు స్థలం నిండిపోతున్నది. అలాగే పలువురు గ్రామస్తులు ఇండ్లలో నుంచే వచ్చే మురుగునీరు కూడా అందులో చేరుతున్నది. ఇటీవల కురిసిన వర్షాలతో కుంట నిండి కంపుకొడుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సదరు స్థలాన్ని చదును చేయించి.. అందులో నీరు నిల్వకాకుండా చూడాలని సదరు స్థల యజమానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నరకం అనుభవిస్తున్నాం...

తన ఇంటిని అనుకొని ఖాళీ స్థలంలో మురుగు నీరు నిల్వ ఉండడంతో నరకం అనుభవిస్తున్నాం. వానకాలం వచ్చిందంటే చాలు ఇంట్లో ఉండడం ఇబ్బంది అయితాంది. సదరు యజమాని ఆ స్థలంలో మట్టి పోయకపోవడంతో మురుగు నీరు అందులోనే నిల్వ ఉంటున్నది. చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తున్నది. కలెక్టర్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి.

- బుర్ర గంగయ్య, గ్రామస్తుడు (మామిడిపల్లి)

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

చందుర్తి, జూన్1: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న అనంతపల్లి, తిమ్మాపూర్, 4న మూడపల్లి, ఆసిరెడ్డిపల్లి, 5న నర్సింగాపూర్ లింగంపేట, 6న మర్రిగడ్డ జోగాపూర్, 9న బండపల్లి సనుగుల, 10న కిష్టంపేట, రామారావుపల్లి, 11న చందుర్తి, ఎన్గల్, 12న చందుర్తి, మల్యాల, 13న రామన్నపేట, కట్టలింగంపేట, కొత్తపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వంతెన పూర్తయ్యేనా?

తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులో కెనాల్‌పై నిలిచిన వంతెన పనులు

- చీర్లవంచ శివారులో ఏడాదిన్నరగా ముందుకుసాగని పనులు
- ఇబ్బందుల్లో పది గ్రామాల ప్రజలు
- వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి

సిరిసిల్ల రూరల్, జూన్ 1: తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులోని శ్రీ రాజరాజేశ్వర ప్రాజెక్టు (మధ్యమానేరు) నుంచి అదనంగా మరో టీఎంసీ నీటి తరలింపునకు గత ప్రభుత్వం చీర్లవంచ-వల్లంపట్ల గ్రామాల మధ్య కెనాల్‌పై వంతెన నిర్మాణం చేపట్టింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయం వరకు 30 శాతం పనులు పూర్తి చేసింది. ఆ తర్వాత అధికారంలో వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఈ కెనాల్‌పై వంతెన నిర్మాణాన్ని విస్మరించగా, ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. ఇప్పటికైన అధికారులు స్పందించి వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

10 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు

కెనాలపై వంతెన పనులు నిలిపి వేయడంతో కెనాల్ లోపల నుంచి వెళ్లాల్సి వస్తుంది. వర్షాలు కురవడంతో కెనాల్‌లో నీరు రావడంతో రాకపోకలు నిలిపోతున్నాయి. చీర్లవంచకు రావాల్సి ఉంటే మూడు కిలోమీటర్ల దూరం అదనంగా తిరిగి చేరుతున్నారు. తాత్కాలిక మట్టి రోడ్డు పోయడంతో వాన కాలంలో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రవాణాభారం పెరగడంతోపాటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పూర్తయితే వల్లంపట్ల మీదుగా ఇల్లంతకుంట మండలంలోని పది గ్రామాల ప్రజలు చీర్లవంచ నుంచి జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. రవాణా భారం తగ్గనున్నది.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. ఏడాదిన్నరగా చీర్లవంచతోపాటు ఇల్లంతకుంట మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ స్పందించాలి. వంతెన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం.

- జక్కుల నాగరాజుయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, (చీర్లవంచ)

కనగర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువుల నీటితొట్టెలో పేరుకుపోయిన చెత్తాచెదారం, నాచు

తొట్టెంతా నాచే..

తాగునీటి కోసం మూగజీవాల ఇక్కట్లు

మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గానూ కనగర్తి గ్రామంలో నర్సరీ పక్కన గతంలో నీటి తొట్టెను ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా సదరు తొట్టె శుభ్రం చేయకపోవడంతో అందులో నాచు, చెత్తాచెదారం పేరుకుపోయి నీరంతా కలుషితమైంది. దీంతో జీవాలు నీరు తాగలేని పరిస్థితి నెలకొన్నది. కలుషితమైన నీరు తాగితే జీవాలు రోగాల బారినపడే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి నీటితొట్టెను శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు.

- కోనరావుపేట, జూన్ 1

కోడెల సంరక్షణకు చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- 32మంది రైతులకు 64 కోడెల పంపిణీ

రైతుకు కోడెలకు సంబంధించిన పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూన్ 1: వేములవాడ రాజన్న కోడెల సంరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. తిప్పాపూర్‌లోని రాజన్న గోశాల నుంచి 32జతల కోడెలను అర్హులైన రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. గోశాల ఆవరణను పరిశీలించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కోడెల సంరక్షణ బాధ్యతను రైతులు పక్కాగా చూసుకోవాలన్నారు. కోడెల సంరక్షణ బాధ్యత పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోశాల ఆవరణలో లోతుగా ఉన్న స్థలంలో మట్టి పోయిస్తూ చదును చేస్తున్నామని తెలిపారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాధాబాయి, ఏవో అఫ్జల్‌బేగం, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

కోడెల కోసం ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలి

వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే కోడెలు కావాలనుకునే రైతులు ఆన్‌లైన్‌లో (https:||rajanna sircilla.telangana.gov.in) నమోదు చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిప్పాపూర్‌లోని గోశాలలో గల కోడెల కోసం అర్హులైన రైతులకు జియో ట్యాగింగ్ ద్వారా కోడెలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదార్ పాస్ బుక్, ఆధార్‌కార్డు, సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివిద్దాం

గంభీరావుపేట, జూన్ 1: నర్మాల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆదివారం గ్రామస్తులు ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. గ్రామంలో అర్హత గల విద్యార్థులందరినీ సమష్టి కృషితో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుందామన్నారు. గ్రామంలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అజయ్, రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ సందడి

స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 1: మండుతున్న ఎండల్లో సేద తీరేందుకు పెద్దలు, ఈత నేర్చుకునేందుకు చిన్నారులు స్విమ్మింగ్‌పూల్‌లో సందడి చేస్తున్నారు. ఆదివారం అల్మాస్‌పూర్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులు, పెద్దలు బిజీబిజీగా గడిపారు. సెలవులు ముగిసి పాఠశాలలకు వెళ్లే తరుణం ఆసన్నంకావడంతో పిల్లలకు ఈత నేర్పించాలనే తపనతో తల్లిదండ్రులు పూల్ వద్దకు వస్తున్నారు. పనిలోపనిగా వారు కూడా ఈత నైపుణ్యాన్ని పిల్లల ముందు ప్రదర్శిస్తూ వారిలో ఉత్సాహంనింపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోడెలకు సువిశాల స్థలాన్ని సేకరించండి

వేములవాడ, జూన్ 1: రాజన్నకు భక్తులు సమర్పించే కోడెల సంరక్షణకు సువిశాలమైన స్థలాన్ని సేకరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఖతార్ పర్యటన ముగించుకొని స్వదేశం వచ్చిన విప్ ఆదివారం హైదరాబాద్‌లో సీఎంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఖతార్ గల్ఫ్ సమస్యలను వివరించారు. రాజన్న ఆలయంలో జరగబోయే అభివృద్ధి, గోశాలలో ఇటీవల జరిగిన సంఘటనలపై సీఎం ఆరా తీశారు.

సిరిసిల్ల రూరల్/గంభీరావుపేట: వేదికపై పూర్వవిద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గంభీరావుపేట, జూన్ 1: గోరంటాల జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల (2003-04లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 22ఏండ్ల తర్వాత ఒక్కటైన విద్యార్థులు తమ ఉన్నత విద్య, ఉద్యోగం, కుటుంబ నేపథ్యం గురించి చర్చించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

సిరిసిల్ల రూరల్, జూన్ 1: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళం నిర్వహించారు. 20ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా (2005-06లో ఎస్సెస్సీ బ్యాచ్) మళ్లీ ఒకచోట కలిశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా ఆడిపాడారు. జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

నేడు ఈజీఎస్ ప్రజావేదిక

వేములవాడ రూరల్, జూన్ 1: వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగో విడుత సామాజిక తనిఖీలో భాగంగా గ్రామాల్లో సామాజిక బృందం చేపట్టిన తనిఖీ నివేదికను ప్రజావేదికలో వెల్లడిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం, కూలీలు హాజరుకావాలని సూచించారు.

సేవాసంస్థాన్ అధ్యక్షుడిగా రమేశ్

వేములవాడ, జూన్ 1: శ్రీ హనుమాన్ మార్కండేయ పద్మశాలీ సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా గేంట్యాల రమేశ్, ఉపాధ్యక్షుడిగా చిందం భగవాన్, ప్రధాన కార్యదర్శిగా తడగొప్పుల బాలరాజు, కోశాధికారిగా వేముల గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా చిలుకదాస్, కార్యవర్గ సభ్యులుగా బత్తుల తిరుపతి, ఎల్లే రాజు, భీమనాథుని సురేందర్, పులి భాస్కర్, గోవింద్ గంగారాజు, భోగా శ్రీహరి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు సిరపురం రమేశ్, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు అవధూత రజినీకాంత్, భావన ఋషి అధ్యక్షుడు కొక్కుల అంజయ్య, సేవా సంస్థాన్ మాజీ అధ్యక్షులు కొక్కుల బాలకృష్ణ, రాపల్లి శ్రీధర్, గూడూరు మధు, వ్యవస్థాపకులు వేముల శ్రీనివాస్, కొక్కుల ప్రసాద్, మద్దిరాల నరేశ్, బిల్ల కృష్ణారి, రమేశ్, పరశురాములు ఉన్నారు.

వృద్ధుల చేరిక

సిరిసిల్ల రూరల్, జూన్ 1: జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం ఆదేశాలతో తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లోని అమ్మ అనాథ ఆశ్రమంలో ఆదివారం ఇద్దరు వృద్ధులను చేర్పించుకున్నామని ట్రస్టు నిర్వహకులు గడ్డం శ్రీనివాస్, తిరుమల తెలిపారు. అచేతనస్థితిలో ఉన్న రాజన్న (60), నిర్మల్‌కు చెందిన లక్ష్మి(55) 108 వాహనంలో ఆశ్రమానికి రాగా, చేర్పించుకున్నామన్నారు. ఇక్కడ కృష్ణవంశీ, దిలీప్ ఉన్నారు.

'బద్మాషులు'.. కుటుంబ కథాచిత్రం

మాట్లాడుతున్న బద్మాషులు చిత్ర దర్శకుడు శంకర్ చేగూరి

సిరిసిల్ల టౌన్, జూన్ 1: కుటుంబ సభ్యులతో కలిసి చూడాల్సిన చిత్రం 'బద్మాషులు' అని ఆ చిత్ర దర్శకుడు శంకర్ చేగూరి పేర్కొన్నారు. సినిమాలో హాస్యంతోపాటు గ్రామీణ నేపథ్యం ఉంటుందన్నారు. ఈ మేరకు బద్మాషులు చిత్ర యూనిట్ సభ్యులు ఆదివారం సిరిసిల్లలో సందడి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు శంకర్ చేగూరి సినిమాకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. బద్మాషులు సినిమాలు బలగం లాంటి ఫీల్ గుడ్ మూవీ అన్నారు. హీరోలుగా మహేశ్ చింతలతోపాటు సిరిసిల్లకు చెందిన కారంపురి విద్యాసాగర్ నటించారని తెలిపారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు, చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్లు అందరూ ఈ సినిమాను సరదాగా చూడొచ్చన్నారు. సిరిసిల్లకు సినిమా ప్రమోషన్‌కు వచ్చిన సందర్భంగా మీరు ఆదరించిన తీరు సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 6న తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలోని పలు థియేటర్‌లలో ఈ సినిమా విడుదల కానుందని చెప్పారు. చిన్న సినిమాను ఆదరించి విజవయవంతం చేయాల్సిన బాధ్యత ప్రేక్షక దేవుళ్లపై ఉందన్నారు. హీరోలు చింతల మహేశ్, కారంపురి విద్యాసాగర్ మాట్లాడుతూ, సినిమా 2గంటల పాటు హాస్యంతో అలరిస్తుందన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి సినిమాను చూడొచ్చని తెలిపారు. సమావేశంలో ఆకునూరి దేవయ్య, నక్క శ్రీకాంత్, గజ్జెల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

త్వరగా కోలుకోవాలి

చంటిని పరామర్శిస్తున్న సీనియర్ నేత రామ్మోహన్, నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 1: ఇటీవలే సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌పై కాంగ్రెస్ నేతల దాడికి దిగగా, అడ్డుకోబోయి పోలీసుల లాఠీ చార్జిలో తీవ్రంగా గాయపడిన బీఆర్ఎస్ సీనియర్ నేత ఆత్మకూరి చంటియాదవ్ త్వరగా కోలుకోవాలని పార్టీ సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్ ఆకాంక్షించారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి చంటి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మోతే మహేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండి జగన్, నాయకులు బొడ్డు శ్రీధర్, పసుల అరవింద్, తదితరులు ఉన్నారు.

వేతన చట్టం అమలు చేయాలి

చందుర్తి, జూన్ 1: కార్మికుల కనీస వేతన చట్టాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో పార్టీ, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించే మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ మండల కన్వీనర్ మర్రి విజయ, నాయకులు బండపల్లి లక్ష్మణ్, ఇందిరా, కొమరవ్వ, లావణ్య, రాజవ్వ, గడ్డం మల్లవ్వ, లలిత, బొడ్డు నర్సయ్య, మల్లేశం, రాజేశ్వరి, పద్మ, మల్లవ్వ, రేణుక, రాజవ్వ, తదితరులు ఉన్నారు.

కోడెల ఖననం

- అడ్డుకున్న రైతులు

వేములవాడ రూరల్, జూన్1: రాజన్న గోశాలలో మృతిచెందిన కోడెలను మహాలక్ష్మి ఆలయ సమీపంలో ఖననం చేసేందుకు తీసుకువచ్చిన ట్రాక్టర్‌ను రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గోశాలలో మృతిచెందిన కోడెలను ఆలయ సమీపంలో ఖననం చేయడం ద్వారా ఈ ప్రాంతంలో దుర్వాసన వస్తుందన్నారు. పంటపొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక్కడ ఖననం చేయవద్దని అడ్డుకున్నారు. కాగా అధికారుల జోక్యంతో సిబ్బంది కోడెలను ఖననం చేశారు.

రోడ్డు ప్రమాదం: ఒకరి మృతి

ముస్తాబాద్, జూన్ 1: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన ఆదివారం గూడూరు స్టేజ్ వద్ద చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కూర సిద్ధిరాములు(55) తన ద్విచక్ర వాహనం పై ముస్తాబాద్‌కు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం గూడూరు స్టేజ్ వద్ద ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ గణేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నర్సయ్య-లక్ష్మి దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌రెడ్డి, రాజు

రాజన్నకు సేవ చేయడం అదృష్టం

వేములవాడ, జూన్ 1: రాజన్న సన్నిధిలో స్వామివారికి సేవచేసే అవకాశం రావడం అదృష్టమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయంలో విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన వరి నర్సయ్య-లక్ష్మి దంపతులను భీమేశ్వరగార్డెన్‌లో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామతీర్థపు రాజు, నరాల శేఖర్, సిరిగిరి రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

రుద్రంగి, జూన్ 1: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని ఎస్ఐ అశోక్ పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్రంగి, చందుర్తి మండలాల వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి, నాయకులతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గంగం మహేశ్, సీనియర్ క్రీడాకారులు కర్ణవత్తుల చందు, తిగుల శ్రీనివాస్, దేశవేని శ్రీనివాస్, దయ్యాల శ్రీను, అంబటి శ్రీనివాస్, గుగ్గిళ్ల తిరుపతి, అరిపెల్లి రవి, కాదాసు రవి, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ అశోక్, నాయకులు

సంఘాలు-కార్యవర్గాలు

సిరిసిల్ల రూరల్, జూన్ 1: తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో ఆదివారం ముదిరాజ్ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమ పరశురాములు ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు పరశురాములు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గోపాలరావుపల్లెలో రెడ్డి సంఘ నూతన అధ్యక్షుడిగా కూతురి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బెంద్రపు రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా అలూరి బాల్‌రెడ్డి, క్యాషియర్‌గా దూది రామచంద్రారెడ్డి, కార్యవర్గసభ్యులుగా నరసింహారెడ్డి, పురుమాండ్ల బాల్‌రెడ్డి, పుర్మాణి కరుణాకరెడ్డి, పబ్బతి రాజిరెడ్డి, కడారి భూమిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట, జూన్ 1: పదిరలో రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచర్ల రవి, ఉపాధ్యక్షుడిగా రేపాక నర్సయ్య, కోశాధికారిగా నర్సయ్య, కార్యవర్గ సభ్యులుగా కంచర్ల శ్రీనివాస్, నరేశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

బోయినపల్లి రూరల్, జూన్ 1: రాళ్ల రామన్నపేట గ్రామ రెడ్డి సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చింతలపల్లి మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుడి తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీగా చింతలపల్లి భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి లచ్చిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఏనుగు జనార్దన్‌రెడ్డి, అన్నాడి బాల్‌రెడ్డి, ముస్కు మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి లచ్చిరెడ్డిని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.